BELIEVERS EASTERN CHURCH
World Church Headquarters, St Thomas Community
Thiruvalla - 689 103, Kerala, India

# కాపరి పత్రిక

మే - జూన్ 2026

ప్రపంచవ్యాప్తంగా విస్తరించియున్న నా ప్రియమైన కాపరులకు మరియు పరిశుద్ధ సంఘ విశ్వాసులందరికీ, మన ప్రభువును, రక్షకుడైన యేసుక్రీస్తు నుండి కృప, కనికరము మరియు సమాధానము మీకు కలుగును గాక!

క్రీస్తు పునరుత్థానుడయ్యారు!

మన సంఘ ఆరాధన క్రమసూచిక (liturgical calendar) ప్రకారం, మనము ఇప్పుడు మన ప్రభువైన యేసుక్రీస్తు పునరుత్థాన కాలంలో ఉన్నాము. మన చుట్టూ ఉన్న లోకం అశాంతిని, అనిశ్చితిని అనుభవిస్తున్నప్పటికీ, మన రక్షకుని పునరుత్థానం వలన కలిగే అచంచలమైన నిరీక్షణలో మరియు ఆనందంలో జీవించడానికి మనము పిలువబడ్డాము. ఎందుకంటే క్రీస్తు పునరుత్థానుడయ్యారు, ఆయన జీవిస్తున్నారు గనుకనే నేను రేపటిని ధైర్యంగా ఎదుర్కోగలను అని మనమందరం కలిసి చెప్పగలం. ఈ ధైర్యంతో మరియు పరాక్రమంతో, పునరుత్థానుడైన క్రీస్తు తన శిష్యులను పంపారు — ఈస్టర్ పండుగ యొక్క ఆనందాన్ని మరియు మన ప్రభువైన యేసుక్రీస్తు పునరుత్థాన నిరీక్షణను మన చుట్టూ ఉన్న లోకానికి ప్రతిబింబించడానికి. యేసు వాగ్దానం చేసినట్లుగానే, పరిశుద్ధాత్మ శిష్యుల మీదకు వచ్చి, వారిని దేవుని ప్రేమకు ప్రతిబింబాలుగా మార్చి శక్తినిచ్చారు. అపొస్తలులు, అనగా 'పంపబడిన వారు', వారు భూదిగంతాల వరకు సుదూర ప్రాంతాలకు పంపబడినారు. వారు పరిశుద్ధాత్మ ద్వారా బలపరచబడి, లోకమంతటా క్రీస్తుకు సాక్షులుగా యుండుటకు వెళ్ళిన పన్నెండు మంది అపొస్తలులను గౌరవించడానికి, సంఘము 'అపొస్తలుల ఉపవాస ప్రార్థనలు' (Apostles Lent) అని పిలువబడే ఒక పవిత్రమైన ఉపవాస కాలాన్ని కేటాయించింది.

**ఈ ఉపవాస కాలం ఎలా ప్రారంభమైంది?** అపొస్తలుల కార్యములు 1:4లో, ప్రభువైన యేసు తన శిష్యులు మహా ఆజ్ఞను (Great Commission) నెరవేర్చడానికి పంపించుటకు ముందు, పరిశుద్ధాత్మ వాగ్దానం కొరకు వేచి ఉండమని కోరడం మనము చూస్తాము. సంఘ పవిత్ర సంప్రదాయం ప్రకారం, అపొస్తలులు తమ మిషనరీ పనుల కొరకు దేవుడు తమను శక్తిమంతులుగా చేయాలని కోరుతూ ఉపవాసాన్ని ప్రారంభించారు. పెంతెకోస్తు రోజున వారు పరిశుద్ధాత్మతో నింపబడే వరకు వారు దీనిని కొనసాగించారు.

అప్పటి నుండి, సంఘము అపొస్తలుల ఉపవాస కాలముగా ప్రసిద్ధి చెందిన ఈ ఉపవాస కాలాన్ని పాటిస్తోంది. ఈ అపొస్తలుల ఉపవాసము ప్రతి సంవత్సరం జూన్ 16న ప్రారంభమై, జూన్ 28 వరకు 13 రోజుల పాటు కొనసాగుతుంది. ఆ తర్వాత మనము రెండు పండుగలను జరుపుకుంటాము — జూన్ 29న పరిశుద్ధ పేతురు మరియు పరిశుద్ధ పౌలు దినోత్సవ వేడుక మరియు జూన్ 30న అపొస్తలుల పండుగ.

**ఈ ఉపవాస కాలాన్ని మనము ఎలా పాటించాలి?** సంఘం యొక్క అన్ని ఉపవాస కాలాల వలెనే, అపొస్తలుల ఉపవాస కాలం కూడా దేవునిపై కేంద్రీకృతమైన, విశ్వాసపాత్రమైన జీవితాలను గడపడానికి ప్రార్థన, ఉపవాసం మరియు ధర్మకార్యాలపై మన దృష్టిని సారించమని పిలుపునిస్తుంది. అయితే ఈ ఉపవాసం ఇతర ఉపవాసాల కంటే భిన్నమైనది, ఎందుకంటే ఇది అపొస్తలుల సేవను కొనసాగించాలని మనలను కోరుతుంది. అందుకే, నా పిల్లలారా, ఈ పవిత్ర కాలంలో అపొస్తలుల కార్యముల గ్రంథం మొత్తాన్ని చదవాలని నేను మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాను. మన ప్రియమైన మెట్రోపాలిటన్ అథనేసియస్ యోహాన్ I (ధన్యస్మృతిలో) తరచుగా చెప్పినట్లుగా, అపొస్తలుల కార్యముల గ్రంథం పరిశుద్ధ సంఘానికి ఒక 'నమూనా' (blueprint), మరియు అపొస్తలుల పరిచర్యను అర్థం చేసుకోవడానికి మరియు సువార్తను పంచుకోవడంలో వారి అచంచలమైన నిబద్ధతను

ధ్యానించడానికి మనకు ప్రధాన వనరునైయున్నది. ఈ వివేచనాత్మక అభ్యాసం ద్వారా, మనము అపొస్తలుల అడుగుజాడల్లో నడవడానికి ప్రయత్నిస్తూ, మన చుట్టూ ఉన్న వారందరికీ సువార్త సందేశాన్ని వ్యాప్తి చేసే పనిని కొనసాగించడానికి బలము మరియు శక్తి కొరకు ప్రభువును ప్రార్థిస్తాము.

**అపొస్తలుల ఉపవాస కాలాన్ని పాటించడానికి మూడు ఆచరణాత్మక మార్గాలు:**

* **సేవ (Serve):** అపొస్తలుల ఉపవాస కాలం పరిశుద్ధ అపొస్తలుల జీవితాలను మరియు వారి మాదిరిని ధ్యానించడానికి మనకు ఏటా లభించే ఒక అవకాశం. అయితే వారిని స్మరించుకోవడం మాత్రమే వారిని గౌరవించడానికి సరిపోదు. వారు ప్రారంభించిన పనిని మనం కొనసాగించడం ద్వారా అపొస్తలుల జ్ఞాపకార్థాన్ని గౌరవించాలి. పునరుత్థానుడైన క్రీస్తు యొక్క నిరీక్షణను మరియు ఆనందాన్ని మన చుట్టూ ఉన్నవారితో పంచుకోవడం వారి అనుచరులుగా మరియు ఆధ్యాత్మిక వారసులుగా మనకు అప్పగించబడింది. కాబట్టి, ఈ కాలంలో, మన అన్ని పారిష్‌లు మరియు డియోసెస్‌లలో ముఖ్యంగా కనికరముతో కూడుకొనిన పరిచర్యలను మరియు కరుణా సేవలను కొనసాగిద్దాం.

* **ప్రార్థన (Pray):** ఎఫెసీయులకు 6:19-20లో పరిశుద్ధుడైన పౌలు మనకు గుర్తు చేసినట్లుగా, మన యాజకులు మరియు మిషనరీలు తమ జీవితాలను తిరిగి అంకితం చేసుకోవాలని మరియు వివిధ రకాల ఇబ్బందుల మధ్య కూడా సువార్త పనిని కొనసాగించడానికి ప్రోత్సహించబడాలని మరియు బలపరచబడాలని మనం ప్రార్థించాలి. మన పిల్లలు మరియు యువతలో ఎక్కువ మంది పరిశుద్ధ సంఘానికి సేవ చేయడానికి తమ జీవితాలను అంకితం చేయాలని కూడా ప్రార్థిద్దాం. పరిశుద్ధ సంఘము క్రీస్తు యొక్క శరీరమునైయున్నది, ఈ లోకంలో యేసు యొక్క నిజమైన విస్తరణకు నిదర్శనమైయున్నదని గుర్తుంచుకోండి.


* **సమర్పణ (Give):** మన దశమ భాగములు మరియు అర్పణలతో పాటు, మన ఆర్థిక సహాయంతో వివిధములైన పరిచర్యలకు మద్దతు ఇవ్వడానికి కూడా మనం పిలువబడ్డాము. ఫిలిప్పీయులకు 4:18లో, పరిశుద్ధ పౌలు ఈ బహుమతులు 'దేవునికి ప్రీతికరమును ఇష్టమునైన యాగమునై యున్నవి' అని మనకు చెబుతున్నారు. కాబట్టి, అపొస్తలుల ఉపవాస కాలం కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండటం ద్వారా మనం ఆదా చేసే డబ్బును మన సంఘం యొక్క పరిచర్యలకు మద్దతుగా ఇవ్వడానికి ఒక అనుకూలమైన సమయం.

నా ప్రియమైన పిల్లలారా, ఎప్పటిలాగే, ఈ పవిత్ర దినాలలో మీలో ప్రతి ఒక్కరినీ నేను నా ప్రార్థనలలో స్మరించుకుంటున్నాను. అపొస్తలుల మాదిరిని అనుసరించడానికి మరియు యేసుక్రీస్తు సువార్త అందించే ఆనందం మరియు నిరీక్షణను మన కుటుంబాలలో, మన సమాజాలలో మరియు భూదిగంతాల వరకు ప్రతిబింబించడానికి మన నిబద్ధతను పునరుద్ధరించుకుందాం. మన ఉపవాసం కేవలం ప్రార్థన మరియు ఆహారమును విడిచిపెట్టుటకే పరిమితమైతే, అపొస్తలుల ఉపవాస కాలం యొక్క ఉద్దేశ్యాన్ని మనం కోల్పోయినట్లే. మాటలోనూ, క్రియలోనూ అపొస్తలులను అనుసరించడం ద్వారా వారిని గౌరవించే కృపను ప్రభువు మనకు ప్రసాదించును గాక. దేవుని చిత్తాన్ని వివేచించే జ్ఞానాన్ని, ఆయన ఆజ్ఞలను పాటించే బలాన్ని మరియు ఆయన కనికరాన్ని ప్రతిబింబించే ప్రేమను మన దేవుడైన యెహోవా మీకు అనుగ్రహించు గాక.

పరిశుద్ధ త్రిత్వమునైయున్న — తండ్రి, కుమారుడు మరియు పరిశుద్ధాత్మ తన అపరిమితమైన కృప మరియు కనికరంతో మనలను నడిపించు గాక, సకల పరిశుద్ధుల మరియు పవిత్ర మరియమ్మ (Theotokos) విజ్ఞాపనలు ఇప్పుడును ఎల్లప్పుడును దేవుని సింహాసనం ఎదుట మనకు రక్షణగా ఉండును గాక. ఆమెన్.

ప్రేమతో మరియు ప్రార్థనలతో,

క్రీస్తులో మీ ఆత్మీయ తండ్రి,



**మొరాన్ మోర్ సామ్యేల్ థియోఫిలస్ మెట్రోపాలిటన్**

**తేదీ** : 5 మే 2026

**స్థలం** : వరల్డ్ చర్చ్ ప్రధాన కార్యాలయం

**గమనిక :** ఈ పత్రికను జాగ్రత్తగా చదివి అర్థము చేసుకొని, విశ్వాసుల ప్రోత్సాహం కొరకు ప్రతి స్థానిక సంఘములో తప్పక చదివి వినిపించగలరు.